వాహనదారులకు ఇబ్బందులు

- మాక్లూరు మండలంలో విరిగిపడిన చెట్లను తొలగించని అధికారులు
- అధికారులు స్పందించాలని వినతి


కృష్ణనగర్ శివారులో..


బోర్గాం (కె) శివారులో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టు

మాక్లూర్ : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల విరిగిపడిన చెట్లను తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మండలంలోని కృష్ణనగర్, బొంకన్‌పల్లి, కల్లెడి, డీకంపల్లి, మెట్టు, గొట్టిముక్కల, బోర్గాం రహదారులపై విరిగిపడిన చెట్లు రోడ్లకు అడ్డంగా అలాగే ఉన్నాయి. దీంతో ఆప్రాంతాల నుంచి ప్రయాణం సాగించే వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. వాహనాలను పక్కకు నిలిపి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించుకుని వెళ్లే పరిస్థితి ఉంది. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా రహదారులపై అలాగే ఉన్న చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. కాగా, మండలంలో ప్రధాన రహదారులపై అడ్డంగా విరిగిపడిన చెట్లను అదే రోజు స్థానిక ఎస్సై రాజశేఖర్ రాత్రికి రాత్రే జోరువానలోను జేసీబీల సహాయంతో తొలగించారు. గతంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల బాగోగులు చూసేందుకుగాను గ్యాంగ్‌మాన్లు ఉండేవారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను ఇతర అసౌకర్యంగా ఉన్న వాటిని వారే తొలగించేవారు. ప్రస్తుతం వారు లేరు.అధికారులు స్పందించి విరిగిపడిన చెట్లను తొలగింపజేయాలి.

ఆర్ అండ్ బీ అధికారులు తొలగింపజేయాలి

గాలితో కూడిన వర్షం పడ్డ రోజు నందిపేట్ వెళ్లే రహదారిపై మాదాపూర్ నుండి మెట్టు రోడ్డు వరకు అడ్డంగా విరిగిపడ్డ చెట్లను జేసీబీతో తొలగించాం. మిగితా గ్రామాలకు వెళ్లే రోడ్లపై పడ్డ చెట్లను ఆర్ అండ్ బీ అధికారులు లేదా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు స్పందించి తొలగింపజేయాలి. – రాజశేఖర్, ఎస్సై, మాక్లూర్

క్లుప్తంగా

ఈనెల 21న మడిగెలకు వేలం పాట

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జంబిహనుమాన్ దేవస్థానం సముదాయం కాంప్లెక్స్, 2, 3లలో గల మడిగెలకు ఈనెల 21న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రవీందర్ శనివారం తెలిపారు. మొత్తం 11మడిగెలకు వేలం పాట చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 10వేలు డిపాజిట్ చేయాలన్నారు. మడిగెలను రెండు సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వేల్పూర్ : వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని పీకేటీపీ బీడీ సెంటర్‌లో టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల వాల్‌పోస్టర్లను నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈనెల 19న సిరికొండ మండల కేంద్రంలో జరిగే నిజామాబాద్ ఉమ్మడి జిల్లా మహాసభ , 21,22 తేదీలలో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి జి.అరవింద్, నాయకులు గంగాధర్, లింబాద్రి, అన్వర్, పద్మ, హేమలత, సాయన్న, రాజేందర్, ఆనంద్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. 20 కుటుంబాలకు చెందిన వారు తమ కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలైతే వారికి మెరుగైన వైద్యం చేయించారు. వీరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు అయ్యేలా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డి కృషి చేశారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జేజే నర్సయ్య, పర్స అనంత్‌రావు, నీలం రవి, షాదుల్లా దావుద్, అంజుమ్, తోట సతీష్, వాకా మహేష్, నలుగురి శ్రీను, రెహమాన్, సాయిబాబా, మందుల కిరణ్, విక్రమ్, పత్రి రాజేందర్, మొండి రాజన్న, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ యూత్ అధ్యక్షుడిగా రమేశ్



మోర్తాడ్: మోర్తాడ్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అర్గుల్ రమేశ్‌ను శనివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ప్రజానిలయంలో ఆయనను పార్టీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల రాములు, ఎలాల శ్రీనివాస్, శివలింగు శ్రీనివాస్, గంగారెడ్డి, మోత్కు భూమన్న, గిర్మాజి గంగాధర్, బూత్‌పురం మహిపాల్, ప్రవీణ్, తెడ్డు గురువయ్య, నాగభూషణం, పుప్పాల అశోక్, నరేష్ యాదవ్, మేర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో చదివించేందుకు శ్రద్ధ చూపాలి



రుద్రూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని మాజీ సర్పంచ్ తీగుళ్ల గంగామణి ప్రసాద్ అన్నారు. మండలంలోని అక్బర్‌నగర్‌లో ఇంగ్లిష్, ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. ప్రైవేట్ పాఠశాలలో వేల రూపాయలు ఫీజులు కట్టి చదివించే బదులుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. కొత్తగా చేరిన విద్యార్థులకు మాజీ సర్పంచ్ గంగామణి అక్షర అభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్లు రవి కుమారి,ఖాజా భాను, ఉపాధ్యాయులు పద్మ, రబ్బానీ, ఫౌజియబేగం, అనూజ, ఐకేపీ వీఓఏ మాణిక్యమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నిజామాబాద్ అర్బన్ : గౌడ అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. 2024- 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఆదివారం న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు ఈ పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆర్మూర్ లోక్ అదాలత్‌లో 8712 కేసుల పరిష్కారం


కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి


బోధన్ కోర్టులో.. న్యాయమూర్తి శ్రీనివాస్

ఆర్మూర్‌టౌన్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరగా పరిష్కారమవుతాయని సీనియర్ సివిల్‌జడ్జి శ్రీదేవి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయసేవ అధికార సంఘం చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ కక్షిదారుల తమ సమస్యలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. సబ్‌కోర్టులో 6543 కేసులు , పీడీఎం కోర్టులో 83, ఎండీఎం కోర్టులో 91, సెకండ్ క్లాస్‌కోర్టులో 1995 కేసులను, మొత్తంగా 8712 కేసులను పరిష్కరించారు. ఈ కార్యాక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి నెల్లి సరశరాణి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్, న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ లో 1794 కేసుల పరిష్కారం..

బోధన్‌టౌన్(బోధన్): లోక్ అదాలత్ ద్వారానే కేసులు సత్వర పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జి ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం బోధన్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1794 కేసుల పరిష్కరించమన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని, కేసులతో సమయం వృధా చేసుకోకుండా జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీట్‌లో ఆల్ ఇండియా 3050వ ర్యాంక్ సాధించిన కృపా నక్షత్ర



ఆర్మూర్‌టౌన్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దేశ వ్యాప్తంగా ఉన్న ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హత పరీక్ష నిర్వహించింది. వీటి ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. ఇందులో ఆర్మూర్ పట్టణానికి చెందిన పవార్ కృపా నక్షత్రకు నీట్‌లో ఆల్ ఇండియా 3050వ ర్యాంకు సాధించిందని తల్లిదండ్రులు అంబిక, ప్రవీణ్ పవార్‌లు పేర్కొన్నారు. ఆమె ఆల్ ఇండియా ర్యాంకు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కృపా నక్షత్ర పట్టణంలోని విద్య హైస్కూల్, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాల పూర్తిచేసింది.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బాల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని బోదేపల్లి, వన్నెల్(బి), శ్రీరాంపూర్, చిట్టాపూర్ గ్రామాల్లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా ధ్యాన శిబిరం

రుద్రూర్ : మండల కేంద్రంలోని యోగా భవనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 15 నుంచి 21 వరకు ఏడు రోజుల పాటు ఉచిత యోగా మరియు ధ్యాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పతంజలి యోగా సోషల్ మీడియా అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, యోగా సమితి అధ్యక్షులు కెవి మోహన్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.15 నుంచి 6.30 వరకు నిర్వహిస్తారని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే రోగాలను ఏ విధంగా తొలగించుకోవచ్చునో యోగా ద్వారా తెలియజేస్తారని వారు తెలిపారు.

ఉచితంగా బియ్యం పంపిణీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్‌లో గల విద్యా హైస్కూల్‌లో రక్షస్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవ్వకు బువ్వ కార్యాక్రమంలో భాగంగా పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. మొత్తం 47మంది పేద వృద్ధులకు 5కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్ మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యాప్రవీణ్, ఉపాధ్యక్షుడు విద్యాగోపికృష్ణ, పట్వారి తులసి, ఎస్‌జీ శ్రీకాంత్, గొనే శ్రీధర్, ఖాందేష్ సత్యం, శరత్ తదిరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేయాలి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

- ఆర్మూర్‌లో బీజేపీ పట్టణ కార్యశాల
- ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

ఆర్మూర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ పట్టణ కార్యశాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి బీజేపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతులకు నివాళి అర్పించారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. జూన్ చివరి వారంలో పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి హోం మంత్రి అమిత్‌షా హాజరు కానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి పసుపు రైతులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లోక భూపతిరెడ్డి, కంచెట్టి గంగాధర్, మందుల బాలు, కలిగోట గంగాధర్, అనిల్, సంతోష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆర్మూర్ పట్టణ నూతన కార్యవర్గం..

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు అధ్యక్షతన పట్టణ శాఖ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ప్రకటించారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులుగా గూగులోత్ తిరుపతి నాయక్, ఖాందేశ్ ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులుగా బండ్లపల్లి నర్సారెడ్డి, భోజారెడ్డి, పాన్ శ్రీనివాస్, దోండి ప్రకాశ్‌లను నియమించారు. వారితో పాటు 46 మందితో కార్యవర్గాన్ని నియమించారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిక


కండువా కప్పుతున్న ఎంపీ అర్వింద్


నవీపేట : నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు శనివారం బీజేపీలో చేరారు. నవీపేటకు చెందిన ప్రవీణ్‌రాజ్, ఫకీరాబాద్‌కు చెందిన సందీప్‌లు తమ అనుచరులతో జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా ఆయన నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు ద్యాగ సరిన్, రాజేందర్‌గౌడ్, భూషన్, అజయ్, రాజశేఖర్, బాల గంగాధర్, భానుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థి కుటుంబానికి అండగా స్నేహితులు


ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

బోధన్: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 1998–99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థి గద్ద సంజీవ్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. శనివారం ఆయన కుటుంబీకులకు తోటి పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. ఈమేరకు రూ.20,500 నగదు, నిత్యావసర సరకులు అందించారు. అస్లాంఖాన్, శ్రవణ్‌కుమార్, జక్కంరాజ్ కుమార్ ,పుప్పాల శ్రీనివాస్ ,మురళి, భాస్కర్, రాజు, కుల పెద్దలు ఎంబ లక్ష్మణ్, గద్ద సాయిలు, రాజేశ్వర్, గంగాధర్, సంజీవ్, తదితరులున్నారు.

అనాథ బాలికకు ఆర్థిక సహాయం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని బజార్‌కొత్తూర్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికకు ఆదివాసి నాయక్‌పోడు కులస్తులు ఆర్థిక సహాయం అందించారు. భవాని అనే బాలిక ఏడాది వ్యవధిలోనే తలిదండ్రులను కోల్పోయింది. దీంతో జిల్లా నాయక్‌పోడు కులస్తులు శనివారం గ్రామానికి వచ్చి భవానికి రూ. 90 వేల ఆర్థిక సహాయాన్ని, నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశారు. నిజామాబాద్‌లో ఉన్న విజయలక్ష్మి హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ బండారి భోజన్న తన వంతుగా రూ. 50 వేలతో పాటు కులసంఘం సభ్యులు పోగు చేసి రూ.40 వేలు అందజేశారు. ఇందులో నుంచి రూ. 75 వేల భవాని పేరు బ్యాంకులో డిపాజిట్ చేసి మిగతా రూ. 15 వేల నగదును నిత్యవసర జీవనోపాధి ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆదివాసి నాయకపోడు గౌరవ అధ్యక్షులు బండారి భోజన్న, జిల్లా అధ్యక్షులు గాండ్ల రాంచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ లోలం గంగాధర్, ఉద్యోగుల సేవాసంఘం అధ్యక్షులు కోండ్రు నవీన్, పీజీ హెచ్‌ఎం సింగం వనిత, మండల నాయకులు మన్నె సాగర్, దుంపల శ్రీనివాస్, మేడిపల్లి గౌతం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



చెత్త కుప్పను తొలగించండి

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని రాజానగర్ కాలనీలో గల ప్రధాన రోడ్డు పక్కన చెత్తకుప్పను పంచాయతీ సిబ్బంది తొలగించడం లేదు. దీంతో చెత్తకుప్పలో పందుల సంచారంతో రోగాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి చెత్తకుప్పను తొలగించాలి.

–కరెంట్ సంతోష్, రాజానగర్, నందిపేట గ్రామం

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

జీపీ కార్మికులకు అందని వేతనాలు

- నందిపేటలో 110 మంది..
- ఆర్థిక ఇబ్బందుల్లో కార్మికులు
- నిధులు విడుదల చేయాలని వినతి


నందిపేటలో చెత్తను సేకరిస్తున్న కార్మికులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడంలేదు. మండలంలో మొత్తం 20 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం కోసం ప్రభుత్వం ఆయా జీపీల పరిధిలో మల్టీపర్పస్ వర్కర్ల పేరున 110 మంది పంచాయతీ కార్మికులను నియమించింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో విశేష కృషి చేస్తున్న కార్మికులకు గత మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే అరకొర వేతనాలు అవికూడ నెల నెలా రాకపోవడంతో ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

మూడునెలల జీతం రావాలే..

నందిపేట గ్రామపంచాయతీ కార్మికురాలిగా పనిచేస్తున్నాను. అసలే తక్కువ జీతానికి పనిచేస్తున్నాం. అదికూడ మూడు నెలలుగా రాకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది. సార్లు స్పందించి తొందరగా జీతాలు ఇవ్వాలి. – నల్గొండ చిన్నక్క, పంచాయతీ కార్మికురాలు, నందిపేట

నిధులు విడుదల కాగానే జమ చేస్తాం

మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలకు సంబంధించిన వేతనాల కోసం ఇదివరకే టీఎస్ బీపాస్ అకౌంట్‌లో చెక్కులను పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే వారి ఖాతాల్లో జమ అవుతాయి. – లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట మండలం

ఇసుక లేక ఆగిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం


జాన్కంపేట్‌లో గుంతలకే పరిమితమైన ఇందిరమ్మ ఇల్లు

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్, సాహెబ్‌పేట్, అమీనాపూర్, లక్కోర, పడగల్ గ్రామాలలో ఇసుక లేక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆగిపోయిందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తుందని ప్రకటించినా, ఇసుక సరఫరా కావడం లేదని వాపోతున్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తొందరగా పనులు ప్రారంభించాలని అధికారులు చెప్పగా గుంతలు తీసి సిద్ధం చేశామన్నారు. ఇసుక కోసం అధికారులను అడిగితే రెవెన్యూ సదస్సుల్లో బిజీగా ఉన్నామని, ఉన్నత అధికారుల నుంచి కూపన్ బుక్‌లు రావాల్సి ఉందని చెబుతున్నారని వాపోయారు. వర్షాకాలం కావడంతో పిల్లర్ గుంతల్లో నీళ్లు నిండుతున్నాయని, ఇసుక ఉంటే ఈపాటికే అడుగు పిల్లర్లు పూర్తయ్యేవని పేర్కొంటున్నారు. వాగు సరిహద్దు ఉన్న గ్రామాల వారికి ఎటువంటి ఆటంకం లేకుండా ఇసుక లభిస్తుండగా, వాగు సరిహద్దు లేని తమ గ్రామాలకు ఇసుక లభించడం లేదన్నారు. రెవెన్యూ సదస్సులు ముగిసినందున వెంటనే ఇసుక సరఫరా చేసి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సమాచారం..

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలంలో ఇటీవల కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన రై తులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

రైతులు తమ పట్టా పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్ ప్రతులను దరఖాస్తు ఫారంతో జత చేసి ఈ నెల 20వ తేదీలోగా స్థానిక ఏఈవోలకు అందజేయాలని కోరారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హనుమాన్ చాలీసా.. పారాయణంలో భక్తులు


బాల్కొండలో గుట్టమీది హనుమాన్ ఆలయంలో పారాయణం చేస్తున్న భక్తులు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో భక్తులు ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నారు. గుట్టమీది హనుమాన్ ఆలయంలో ఉదయం, దాస్ హనుమాన్ మందిరంలో సాయంత్రంహ నుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా భజన కీర్తనలతో అలరిస్తున్నారు. గత పదేళ్లుగా ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణం చేస్తు ఆదర్శంగా నిలుస్తున్నారు.